## ఈ వారం కథ

'ఏడు సినిమా హాళ్ళూ, ఎనిమిది ప్రైవేటు హాస్పిటళ్ళూ వున్నా ఒప్పుకోని మా వారు పోలీస్ స్టేషన్ని టౌన్ - రూరల్ అని విభజించేసరికి ఈ ఊరు ఖచ్చితంగా పట్నం అయ్యిందని ఒప్పుకున్నారు. చిన్నా పెద్దా కర్మాగారాలు, మురిక్కాలవలు, దుమ్మురేగిపోయే రోడ్లు, మంచినీళ్ళ బురద చెరువు, ఏడుగజాల కోకల్ని ఒళ్ళంతా చుట్టబెట్టుకుని రవిక వేసుకోడానికి సిగ్గుపడే వయసుమళ్ళిన ఆడవాళ్ళు, మూరెడు స్కర్ట్‌ని మోకాళ్ళపైకి ధరించి లూజు షర్టుల్లో కత్తిరించిన జుట్టుల్తో ఎగురుకుంటూ తిరిగే ఆడపిల్లలు - ఇన్ని వైవిధ్యాల మధ్య ఇది పల్లోపట్నమో నాకైతే డైలమానే. ఒక్కటి మాత్రం ఖచ్చితంగా ఒప్పుకోగల్ను - ఊరంతా ఎలా కొట్టుకుపోయినా మా క్రిష్ణనగర్ కాలనీ మాత్రం తన స్పెషాలిటీని నిలుపుకుని ఊరంతటికీ మకుటంలా, పట్నంలా వెలిగిపోతోంది. మా కాలనీని అంతా పోష్ లొకాలిటీ అంటారు.

కాలనీ అంతా బిజినెస్‌మెన్ కట్టుకున్న గొప్పగొప్ప బిల్డింగ్స్‌తో అందాలు చిందుతూ వుంటుంది. అసలా కాలనీలో మాకు ప్లాట్ దొరకడం చాలా అదృష్టమనుకుంటాను నా మట్టుకు నేను. అదంతా మా లేడీస్ క్లబ్ ప్రెసిడెంటు మాణిక్యాంబగారి చలవే. "సులోచనగారూ! మా ఇంటిపక్క ఖాళీస్థలం అమ్మకానికొచ్చింది. మీ వారితో చెప్పికొనిపించరాదూ" అని ఆవిడన్నప్పుడు ఆనందంతో ఉక్కిరి బిక్కిరయ్యాను నేను. ఒక్క సర్కిలినస్పెక్టరు భార్యగా ఆ వూళ్ళో నా విలువేం తక్కువది కాకపోయినా, తప్పకుండా మా స్టేటస్ ఇంకొంచెం పెరుగుతుంది ఆ కాలనీలో ఇల్లు కడితే.

అందుకే మావారిని శతపోరి ముందా స్థలం కొనిపించేను. పాపం, ఆయన కృషిలోపం లేకుండా 'శ్రమించి' సంపాదించి అక్కడి బిల్డింగ్స్‌కేం తీసిపోకుండా ఇల్లు కట్టించేరు.

# పోష్‌మేనరిజం

—కె. వరలక్ష్మి



జనానికేమున్నా లేకపోయినా భక్తి లేక పోతే చెడిపోతారని గట్టి నమ్మకంతో అంతా కలిసి చందాలేసుకుని పాలరాతితో క్రిష్ణమందిరం కట్టించాం. నిజానికి మాకెవరికీ తరచుగా గుడి కెళ్ళడానికి తీరదు. అందుకే నెలకింతని జీతం పడేసి ఓ అర్చకుణ్ణి నియమించాం. గుడిని శుభ్రంగా వుంచడం, పూజాదికాలు నిర్వర్తించడం, ఉదయం - సాయంత్రం స్పీకర్ పెట్టి భక్తి పాటల్తో జనాన్ని హెచ్చరించడం అతని నిత్య కార్యక్రమం. మాకందరికీ ముఖ్యమైంది హెల్త్ క్లబ్బు, బ్యూటీ పార్లర్. గుడికన్నా ముందే అవి వెలిశాయి.

సాయంత్రం వరకూ వ్యాపార వ్యవహారాలూ, ఆ తర్వాత రిక్రియేషన్ క్లబ్బులో రమ్మీ, బిలియర్డ్స్ వగైరాల్తో కాలనీలో మగాళ్ళెప్పుడూ బిజీగానే వుంటారు. ఇంటి వ్యవహారాలూ, పిల్లల చదువులూ పట్టించుకోవడం అస్సలు పడదుపాపం.

ఇక ఆడవాళ్ళు - వాళ్ళకుండే పనుల్తో వాళ్ళూ బిజీనే. మా లేడీస్ క్లబ్ సెక్రెట్రీగారి మాటల్లో చెప్పాలంటే "అబ్బబ్బ, ఏం జీవితమండి బాబూ, రోజుకి మరో నాలుగ్గంటలు ఎక్కువుంటే బావుండుననిపిస్తోంది. ఉదయం లేస్తూనే వ్యాయామం కోసం హెల్త్ క్లబ్బుకెళ్ళాలా! అక్కణ్ణుంచొచ్చి పనివాళ్ళు ఇల్లంతా శుభ్రంగా వుంచారో లేదో చూసుకోవాలి. ఇల్లు మొత్తం తిరిగి చూసేసరికి ప్రాణం చాలోస్తోందనుకోండి. మా వారి కసలే కార్పెట్లు రోజూ దులిపించాలి. అసలే అవి కాశ్మీరు నుంచి తెప్పించినవి కదా, పనివాళ్ళకి వాటి విలువేం తెలుసు? దగ్గరుండకపోతే తగలేసేస్తారు. మొన్నోసారి అలాగే, చైనానుంచి తెప్పించిన పింగాణీ డిష్, బంగారం లాంటి లండన్ క్రిష్టల్ యాష్ట్రే వాళ్ళ మొహాన్నెట్టుకున్నారు. అయ్యిందా, ఇక డాక్టరు సలహా ప్రకారం ఒకే ఒక బ్రెడ్ స్లైస్, తిని, ఓ గ్లాసు నిమ్మరసం గొంతులో పోసుకుని బ్యూటీ పార్లర్‌కెళ్తే అక్కడో చేంతాడంత క్యూ. అక్కడ అలంకరణ పూర్తైవచ్చేసరికి ఒక్కోసారి ఒంటిగంటా, రెండు అవుతోంది. తిండి తిన్నాననిపించేసరికి ఇదిగో ఇలా మన క్లబ్బుకి టైమవుతోంది. ఇక్కణ్ణుంచి ఇల్లు చేసేసరికి రాత్రి ఏ టైమవుతుందో చెప్పలేం కదా!"

"మరి పిల్లల చదువులెప్పుడు?"

"అయ్యో, ఏ చదుగుతార్లెండి, పిల్లల చదువులా నా తలకాయా? ఏం చేస్తాం చెప్పండి. మన స్వార్థం చూసుకుంటే ఎలా? సొంత లాభం కొంత మానుకుపొరుగువారికి తోడు పడవోయ్' అన్నాడు గదా కవిగారు. ఒకొక్కప్పుడు నేన్నిజంగా గర్వపడుతుంటాను. ఈ క్లబ్బుద్వారా మనం చేస్తున్న సేవా కార్యక్రమాలకి" ఎమోషనెక్కువైపోయి ఆవిడ కళ్ళల్లో నీళ్ళూరాయి. నేరకపోయి నేనా ప్రశ్న వేసానని తర్వాత అనుకున్నాను. బి.ఎడ్ చేసిందాన్ని ఆ కాలనీకి నేనొక్కదాన్నే కాబట్టి అంతా కలిసి నన్నో ట్యుటోరియల్ నడపమని సూచించారు. రెండ్రోజుల్లో అది తీర్మానమై కూర్చుంది.

ఇంటికొచ్చి ఆలోచిస్తే దాంట్లో తప్పేం లేదనిపించింది. నిజానికి క్లబ్బుపేరుతో టైమంతా వేస్టై పోతోంది. నా పిల్లల్ని చదివించుకోడానికి కూడా తీరడం లేదు. ముఖ్యంగా - పులిని చూసి నక్కవాత పెట్టుకున్నట్టు ఇల్లు కట్టేంకదా! దాని తాలూకు అప్పులు తీర్చాల్సినవి దండిగానే వున్నాయి. మా వారికి కొంత సాయపడినట్లైనా అవుతుంది.

సంగతి విని ఆయన నవ్వేశారు. "నీ ఓపిక" అన్నారు తర్వాత. ఇక నుంచి ఎక్కడికి ట్రాన్స్ఫరయినా'నొక్కణ్ణే పోవాల్సిందేనా" అని హాస్యమాడేరు.

మా ప్రెసిడెంటు తల్చుకున్నాక పిల్లలకి కొదవేముంటుంది? కాలనీలో అందరూ పిల్లల్ని స్కూల్స్ మాన్పించి ట్యుటోరియల్స్‌కి పంపించసాగేరు. అవే బుక్స్‌తో నేమా కంటిన్యూ చేశాను. వెంటనే మరో ఇద్దరు అసిస్టెంట్స్‌ని వేసుకోవాల్సి వచ్చింది. మంత్లీ ఫీ స్ తప్ప ఎడ్మిషన్లూ అవీ ఇప్పట్లో వద్దని ముందే అనుకున్నాం.ఫర్నిచర్ మా లేడీస్ క్లబ్బు కొనిచ్చే ఒప్పందం. ప్రారంభోపన్యాసంలో మా ప్రెసిడెంటు "ఈ స్కూలు కేవలం ఈ కాలనీవాసుల పిల్లలకే కాకుండా అందరికీ ఉపయోగపడాలని కోరుకుంటున్నాన"ని చప్పట్ల మధ్య చెప్పింది.

పది రోజుల్తర్వాత: ఆ రోజు క్లబ్బుకెళ్ళినప్పుడు స్వీపర్ రాజమ్మ "అమ్మగారూ! మా కుర్రోడికి సదువు సెప్పి పున్యం కట్టుకోండి" అనడిగింది. ఆరంభోత్సాహంలో వున్న నేను 'సరే' అన్నాను. మరో వారం తర్వాత రాజమ్మ కొడుకు అప్పారావు పగిలిన పలకొకటి చంకన ఇరికించుకుని స్కూలుకొచ్చాడు. వాడి ఒంటి మీది యూనిఫాం కొత్తది కాదు. ఎవరో దయతలచి ఇచ్చిన పాతబట్టలు వేసుకున్నాడు. మా కాలనీ పిల్లల మధ్యవాడో దిష్టి దివిటీలా వున్నాడు. ఏ మాటికామాటే చెప్పకోవాలి. చూపులకి ఎలా వున్నా వాడి గెస్సింగ్ పవర్ మాత్రం గొప్పది. చెప్పింది వెంటనే గ్రహించుకుంటున్నాడు. నాకు ముచ్చటేసింది వాణ్ణి చూస్తే. కాకపోతే, మా కాలనీ పిల్లల్లో వున్న అనవసరమైన బింకం, అక్కర్లేనంత ధైర్యం వాడి కళ్ళల్లో లేదు.

అప్పారావొచ్చిన రెండో రోజే మా పక్కింటి ప్రెసిడెంటుగారింట్లో పిల్లలు నలుగురూ రావడం మానేసారు. మర్నాడు సెక్రెట్రీగారింట్లోంచి, ఆ మర్నాడు వైస్ ప్రెసిడెంటుగారింట్లోంచి... అలా..అలా.. క్రమంగా మానేయడం చూసి హడావుడిగా క్లబ్బుకి పరుగెత్తాను. మా ప్రెసిడెంటుగారందీ "చూడండి సులోచన గారూ, మనదసలే పోష్ లొకాలిటీ కదా, మన పిల్లల పెంపకాలే వేరుగా వుంటాయి. లేబరుపిల్లల్తో కలిస్తే.. కష్టం కదా!" ఏం కష్టమో అర్థం కాకపోయినా 'అవునవున'ని గొర్రెలా తలూపి వెనక్కి తిరిగేను.




## 14 ఏళ్ళుగా వచ్చిన టి.వి. సీరియల్

మనదేశంలో టి.వి.లో తెలుగు సీరియల్ బ్రతుకు 13 వారాలు– ఎక్స్‌టెన్షన్ రాకపోతే. ఢిల్లీ ప్రసారాల్లో రామాయణం, మహాభారత్ లాంటివి ఇంకొంచెం ఎక్కువ కాలం వచ్చాయి.

కాని అమెరికాలో టి.వి. సీరియల్స్ ఏళ్ళ తరబడి వస్తాయి. సరిగ్గా చెప్పాలంటే 14 ఏళ్ళు.

సి.బి.స్. వారు ప్రసారం చేసిన 'నాట్స్ లేండింగ్' అనే టి.వి. సీరియల్ 14 సంవత్సరాలు తర్వాత మే 13, 1993 గురువారం ముగిసిన సందర్భంలో ఓ వారపత్రికలో ఇచ్చిన ప్రకటన ఇది. పాత్రలు అలాగే వుంటాయి కాని వాటిని పోషించే పాత్రధారులు మారుతుండడం అమెరికన్ టి.వి. సీరియల్స్‌లో రివాజు. ('సేంటా బార్బరా' అనే అతి పెద్ద టి.వి. సీరియల్‌ని స్టార్ టి.వి. కనెక్షన్ కల వాళ్ళు చూస్తున్నారు ఇండియాలో. ఇదీ అనేక సంవత్సరాలుగా వస్తున్న సీరియల్).

— డి.పద్మజ